




ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పార్క్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 263 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- | గురువారం 24 ఏప్రిల్ 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# ఉగ్రవాదులకు కలలో కూడా ఊహించని శిక్ష విధిస్తాం..

## పహల్గాం ఘటనపై మోదీ స్ట్రాంగ్ వార్నింగ్

**పహల్గాం దాడిపై ప్రధాని మోదీ తొలిసారి ఓ బహిరంగ వేదికపై స్పందించారు. ఉగ్రదాడికి పాల్పడిన వారు భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు.**

**పట్నా, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):** ఉగ్రవాది ఎక్కడ నక్కినా సరే వెతికి మరీ శిక్షిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న వారికి కలలో కూడా ఊహించని విధంగా కఠిన శిక్ష విధిస్తామన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బిహార్‌లోని మధుబనిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాంలో ఉగ్రదాడి గురించి ఆయన ప్రస్తావిస్తూ.. ముష్కరులకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తొలుత తన ప్రసంగం ఆరంభంలో పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించారు.



మోదీతో పాటు సభలోని వారంతా ఒక నిమిషం పాటు మౌనం పాటించి అంజలి ఘటించారు. అనంతరం దాడి గురించి ప్రధాని స్పందించారు. "ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉంది. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయింది. ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతిఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయి. ఇది కేవలం పర్యాటకులకు జరిగిన దాడి మాత్రమే కాదు.. భారత ఆత్మపై దాడి చేసేందుకు శత్రువులు చేసిన సాహసం" అని మోదీ అన్నారు. "పహల్గాం ఉగ్రదాడి వెనక ఉన్నవారు.. కుట్రలో భాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తాం. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, ట్రాక్ చేసి, శిక్షిస్తామని యావత్ భారతీయులకు హామీ ఇస్తున్నా. బాధితులకు న్యాయం చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తాం. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉంది. ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేసేందుకు సమయం ఆసన్నమైంది. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది విరిచేస్తారు" అని ప్రధాని గట్టిగా హెచ్చరించారు. ఈసందర్భంగా భారత్కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియజేశారు. "మానవత్వాన్ని విశ్వసించే ప్రతిఒక్కరూ మాకు అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నా. ఉగ్రవాదంతో భారత ఐకమత్య స్ఫూర్తిని బద్దలు కొట్టలేరు. ఉగ్రవాదానికి శిక్ష తప్పదు" అని మోదీ స్పష్టం చేశారు. ఏప్రిల్ 22న జమ్మూకాశ్మీర్‌లోని అనంత్నాగ్ జిల్లా పహల్గాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు నరమేధానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను చుట్టుముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ యువకుడు ప్రాణాలు కోల్పోయారు.

### పాలనలో ఏఐ వినియోగించినా..

## మానవీయ కోణం ముఖ్యం:చంద్రబాబు

**'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అంశంపై సచివాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీల అవశ్యకత, పాలనలో వాటి వినియోగం పైనా సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులకు మార్గనిర్దేశం చేశారు.**



**అమరావతి, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):**'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అంశంపై సచివాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీల అవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైనా సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఈ వర్క్‌షాప్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల అధికారులు, కేంద్ర ఐటీశాఖ మాజీ సెక్రెటరీ చంద్రశేఖర్ సహా పలువురు నిపుణులు హాజరయ్యారు. గుడ్ గవర్నెన్స్ కోసం ఏఐ సహా నూతన టెక్నాలజీ వినియోగం, పౌర సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై చర్చించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పౌర సేవల్లో టెక్నాలజీ వాడకం, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు, ఫలితాలను పరిశీలించారు. ఏయే విభాగాల్లో ఎలాంటి సాంకేతికత వాడొచ్చు. ప్రస్తుత సమాచారం ఆధారంగా సేవలను ఎలా విస్తృత పరచవచ్చు అనే అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పాలనలో ఏఐ వినియోగించినా.. మానవీయ కోణం ముఖ్యమని సీఎం అన్నారు. టెక్నాలజీ వినియోగంతో రియల్‌టైమ్లో సేవలు అందిస్తామన్నారు. స్మార్ట్ పాలనకు ప్రాధాన్యత ఇస్తూ త్వరలో 'డేటా లేక్' ఏర్పాటు చేస్తామన్నారు. భూ రికార్డుల డిజిటలైజేషన్ వేగంగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఈ వర్క్‌షాప్ రెండు రోజుల పాటు జరగనుంది.

## గత ప్రభుత్వం పంచాయతీ నిధులన్నీ నిర్వీర్యం చేసింది:పవన్ కళ్యాణ్

**గ్రామ పంచాయతీల నిధులన్నీ గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విమర్శించారు.**

**అమరావతి, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):**గ్రామ పంచాయతీల నిధులన్నీ గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విమర్శించారు. బిల్లులు రాకపోయినా పనులు చేసిన గుత్తేదారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని సి.కె. కన్వెన్షన్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో పవన్ పాల్గొని మాట్లాడారు.




"పంచాయతీరాజ్ శాఖను ఇష్టంగా తీసుకున్నా. గ్రామాలు స్వయం ప్రతిపత్తి సంస్థలుగా ఎదగాలి. పల్లెల్లో ఉండటమంటే ఇష్టం.. కానీ కుదరలేదు. అధికారులు కృషితో గ్రామాల్లో వేగవంతమైన అభివృద్ధి సాగుతోంది. గతంలో చాలా తండాల్లో పర్యటించా.. అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. చిన్న పైరవీలు చేసినా చర్యలు తప్పవు" అని పవన్ కల్యాణ్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి ఈ సందర్భంగా సంతాపం ప్రకటించారు.

### వరంగల్‌లో 14 మంది

## మావోయిస్టుల లొంగుబాటు

**వరంగల్‌లో 14 మంది మావోయిసులు లొంగిపోయారు. పోలీసుల ఎదుట లొంగిపోయిన వారిని ఐజీ చంద్రశేఖర్ రెడ్డి మీడియా ముందుకు తీసుకొచ్చారు.**

**వరంగల్, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):** వరంగల్లో 14 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పోలీసుల ఎదుట లొంగిపోయిన వారిని ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మీడియా ముందుకు తీసుకొచ్చారు. ఒక్కో మావోయిస్టుకు రూ.25వేల ఆర్థిక సహాయం అందించారు.




ఈ సందర్భంగా ఐజీ మాట్లాడారు. "రెండు నెలలుగా మావోయిస్టుల లొంగుబాట్లను ప్రోత్సహిస్తున్నాం. ఈ ఏడాది 250 మంది సరెండర్ అయ్యారు. నేడు 14 మంది లొంగిపోయారు. వీరిలో ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు. తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.25వేలు అందజేశాం. మావోయిస్టులు హింసాయుత విధానాలు వదిలివేసేలా చేయడమే మా ఉద్దేశం. ఏ రాష్ట్రానికి చెందిన మావోయిస్టులు వచ్చి లొంగిపోయినా సహకారం అందిస్తాం. జనజీవన స్రవంతిలో కలిస్తే ఉపాధి అవకాశాలు కల్పిస్తాం" అని చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

### పహల్గాం ఉగ్రదాడి...

### మధుసూదన్ రావుకు నివాళులర్పించిన

## పవన్ కళ్యాణ్

**పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మధుసూదన్ రావు మృతదేహానికి ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాళులర్పించారు.**



**కావలి, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):** పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మధుసూదన్ రావు మృతదేహానికి ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాళులర్పించారు. నెల్లూరు జిల్లా కావలి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడొద్దని ప్రభుత్వం తరఫున అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అంతకు ముందు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కావలి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## తెలంగాణలో మరింత పెరగనున్న ఎండల తీవ్రత


**తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.**

**హైదరాబాద్, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు ఎక్కువగా ఉండే వీలుందని వెల్లడించింది. ఇవాళ, రేపు ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వడగాల్పులు వీచే అవకాశముందని పేర్కొంది. చాలా జిల్లాల్లో రాత్రిపూట వేడి వాతావరణం మరింత ఎక్కువగా ఉండనుందని తెలిపింది. ఉత్తర, దక్షిణ ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్ర, శనివారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే వీలుందని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముందని వెల్లడించింది.



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఆపరేషన్.. 1000 మంది మావోయిస్టులను చుట్టుముట్టిన 20వేల బలగాలు..!

ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో భారీ ఆపరేషన్ కొనసాగుతోంది.



**చర్ల, ఏప్రిల్ 24, (రిపబ్లిక్ న్యూస్):** ఛత్తీస్‌గఢ్‌లో అతిపెద్ద యాంటీ-నక్సల్ ఆపరేషన్ కొనసాగుతోంది. బీజాపుర్ అడవుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు నక్కినట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. దాదాపు 1000 మంది మావోయిస్టులను సుమారు 20వేల మంది భద్రతా సిబ్బంది చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం ధర్మతాళ్లగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్కౌంటర్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్టేషన్ పరిధిలోకి వచ్చే కర్రెగుట్టల కేంద్రంగా అగ్రనేతలు, మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఉన్నారనే సమాచారంతో కేంద్ర పారామిలటరీ బలగాల నేతృత్వంలో ఈ ఆపరేషన్ చేపట్టారు. కర్రెగుట్టలలో దాదాపు 1000 మంది మావోయిస్టులు దాగి ఉన్నట్లు సమాచారం. అగ్రనేత హిడ్మా నేతృత్వంలో వీరంతా అక్కడకు చేరినట్లు తెలుస్తోంది. వీరిలో కమాండర్ స్థాయి నేతలు, మావోయిస్టు అగ్ర నాయకులు ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం వచ్చింది. దీంతో ఈ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. భీమవరంపాడు, పూజారీ కాంకేర్, పామేడు అటవీ ప్రాంతాల్లో కాల్పుల మోత మోగుతోంది. కూంబింగ్ నేపథ్యంలో కర్రెగుట్ట దండకారణ్యంలోని పలు గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు. గాలింపు చర్యల్లో డీఆర్జీ బస్తర్ ఫైటర్ కోబ్రా, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్ సైనికులతో పాటు ఛత్తీస్ గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర పోలీసులు పాల్గొన్నారు. 48 గంటలుగా ఈ కూంబింగ్ కొనసాగుతోంది. మందుపాతరలు అమర్చామని ఇప్పటికే మావోయిస్టులు లేఖల ద్వారా ప్రకటించారు. ప్రజలెవరూ అటవీ ప్రాంతంలోకి రావొద్దని హెచ్చరించారు. దీంతో గాలింపు అత్యంత అప్రమత్తంగా కొనసాగుతోంది. బుధవారం నాటికి 3 వేల మందితో కూంబింగ్ చేపట్టగా.. గురువారం ఉదయం అదనంగా మరో 2 వేల మందిని రప్పించారు. దీంతో ఈ 5 వేల మంది భద్రతా సిబ్బంది కర్రెగుట్టల అటవీప్రాంతాన్ని చుట్టుముట్టినట్లు సమాచారం. అయితే, భద్రతా బలగాల సంఖ్య 20వేల వరకు ఉంటుందని పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. బస్తర్, అబూజ్మడ్ దండకారణ్యంపై హిడ్మాకు పూర్తి అవగాహన ఉంది. అతడి టార్గెట్గానే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు సమాచారం. హిడ్మాతో పాటు మావోయిస్టు బెటాలియన్ చీఫ్ దేవాను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# ఆ హీరోయిన్ అంటే ఎంత ఇష్టమో.. ఆమెను ఆరాధించా: నాని

తాను ఒక హీరోయిన్‌ను ఆరాధించినట్లు నాని తెలిపారు. 'హిట్ 3' ప్రచారంలో ఆయన బిజీగా ఉన్నారు.



తన సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాని ఎప్పుడూ ముందుంటారు. ఆయన నటించిన తాజా సినిమా 'హిట్ 3'. మే 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈనేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా గడపుతున్నారు నాని. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ.. తనకు ఇష్టమైన హీరోయిన్ గురించి చెప్పారు. "నాకు శ్రీదేవి అంటే ఎంతో ఇష్టం. ఆమెను ఆరాధించాను. 'క్షణ క్షణం' సినిమా ఎన్నిసార్లు చూశానో లెక్కలేదు. లక్షల సార్లు చూడగలిగిన చిత్రమది. ఆమె అంత అందంగా ఎలా ఉన్నారో నాకు ఇప్పటికీ అర్థం కాదు. ఆ సినిమాకే శ్రీదేవి అందాన్ని తెచ్చారు" అని తెలిపారు. ఇక ఇదే ఇంటర్వ్యూలో 'హిట్ 3', అజయ్ దేవగ్ 'రైడ్ 2' ఒకే రోజు విడుదలవుతున్నాయి కదా.. పోటీ తప్పదా అనే ప్రశ్నకు ఆసక్తికర సమాధానమిచ్చారు. "రైడ్ 2'కు ప్రాధాన్యమివ్వండి. అజయ్ సర్తో తో నాకు పోటీ లేదు. మీకు వీలుంటే 'హిట్ 3'ను థియేటర్లో చూడండి" అని చెప్పారు. 'హిట్ యూనివర్స్‌' భాగంగా రూపొందుతోన్న సరికొత్త చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. నాని కథానాయకుడిగా శైలేశ్ కొలను దర్శకత్వంలో ఈ సినిమా సిద్ధమవుతోంది. ఇందులో నాని సరసన శ్రీనిధి శెట్టి నటించారు.

### అభిమాని స్క్రిప్ట్ తీసుకున్న నాని..

ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు. నాని. తాజాగా ఆయన ఓ అభిమానిని ప్రోత్సహించిన తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. 'హిట్ 3' ప్రమోషన్లో భాగంగా ఆయన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడికి వచ్చిన ఓ అభిమాని తన వద్ద మంచి కథ ఉందని చెప్పారు. దీంతో నాని అతడిని స్టేజ్ పైకి పిలిచి మాట్లాడారు. కథకు సంబంధించిన స్క్రిప్ట్ పేపర్ను తీసుకున్నారు. తప్పకుండా దాన్ని చదివి రిప్లై ఇస్తానని చెప్పారు. "మిమ్మల్ని చూస్తుంటే సినిమాపై మీకున్న అభిమానం కనిపిస్తుంది. ఇలానే ఉండండి. ఏదో ఒకరోజు గొప్ప దర్శకుడు అవుతారు" అని ప్రోత్సహించారు. అతడిని ప్రేమగా హత్తుకున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో వైరల్గా మారింది.

రిపబ్లిక్ సినిమా CINEMA

# ఉగ్రదాడి.. పాకిస్థానీ నటుడి సినిమా పోస్ట్ డిలీట్ చేసిన నటి!

ఉగ్రదాడి జరిగిన తర్వాత నటి వాణీకపూర్ తన తాజా సినిమా పోస్టర్ను డిలీట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమా పోస్టు షేర్ చేసినందుకు ఆమె విమర్శలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే.



జమ్మూ కాశ్మీర్లోని పహల్గాంలో ప్రకృతి అందాలను ఆస్వాదించడానికి వెళ్లిన పర్యటకులపై జరిగిన ఉగ్ర దాడిని యావద్భారతం ఖండించింది. సినీ ప్రముఖులు కూడా ఇది చాలా క్రూరమైన చర్య అంటూ పోస్టు పెట్టారు. ఈ నేపథ్యంలో బాలీవుడ్ నటి వాణీకపూర్ వార్తల్లో నిలిచారు. ఆమె నటించిన 'అబీర్ గులాల్' సినిమాను ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. అందులో పాకిస్థానీ నటుడు ఫవాద్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించారు. కొన్ని రోజులుగా ఈ సినిమా ప్రచారంలో జోరుగా పాల్గొంటోన్న వాణీకపూర్.. ఈ సినిమాను ప్రమోట్ చేస్తూ మంగళవారం తన సోషల్ మీడియాలో ఓ పోస్టర్ షేర్ చేశారు. అదే రోజు ఉగ్రదాడి జరిగి అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. అయితే వాణీకపూర్ ఆ దాడిపై స్పందించకుండా పాకిస్థానీ నటుడి సినిమాను ప్రమోట్ చేశారంటూ విమర్శలు మొదలయ్యాయి. దీంతో ఆమె తన తాజా పోస్టు డిలీట్ చేసినట్లు తెలుస్తోంది. గతంలో ఈ సినిమాపై ప్రచారంలో భాగంగా పెట్టిన పోస్టర్లను మాత్రం అలానే ఉంచారు. అలాగే దాడిపై స్పందిస్తూ మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. నటుడు ఫవాద్ ఖాన్ కూడా ఈ దాడిని ఖండిస్తూ పోస్ట్ పెట్టారు. మరోవైపు ఈ సినిమాను బాయ్కాట్ చేయాలంటూ ఎక్స్లో హ్యాష్యాగ్స్ ట్రెండ్ అవుతున్నాయి. ఈ సినిమాను ప్రకటించిన నాటినుంచే కొందరు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. తాజాగా జరిగిన ఉగ్ర దాడితో ఈ వ్యతిరేకత మరింత పెరిగింది. ఈ సినిమాను ప్రోత్సహిస్తున్నందుకు బాలీవుడ్ పైన కూడా విమర్శలు మొదలయ్యాయి. ఫవాద్ ఖాన్, వాణీకపూర్ జంటగా నటించిన 'అబీర్ గులాల్' మే 9న విడుదల కానుంది.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1927 : పాత్రికేయుడు, అభ్యుదయవాది నండూరి రామమోహనరావు జననం (మ.2011).
- 1929 : కన్నడ సినిమా నటుడు రాజ్ కుమార్ జననం (మ.2006).
- 1969 : ఖగోళ, జ్యోతిష శాస్త్ర పండితుడు శంకరమంచి రామకృష్ణ శాస్త్రి జననం.
- 1970 : మొదటిసారి చైనా "డాంగ్ ఫాంగ్ హాంగ్ 1" అనే ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపించింది.
- 1973 : కేశవానంద భారతి తీర్పు.
- 1973 : భారతదేశ క్రికెట్ ఆటగాడు సచిన్ టెండుల్కర్ జననం. (చిత్రంలో)
- 1974 : హిందీ కవి రామ్‌ధారీ సింగ్ దినకర్ మరణం (జననం1908).
- 1993 : పంచాయతీ వ్యవస్థ అమలులోకి వచ్చింది.
- 2005 : దక్షిణ కొరియాలో మొదటిసారి క్లోనింగ్ ప్రక్రియ ద్వారా జన్మించిన కుక్క స్నప్పీ.
- 2010 : జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం
- 2011 : ఆధ్యాత్మిక గురువు, సంఘ సంస్కర్త పుట్టపర్తి సత్య సాయి బాబా మరణం (జ. 1926).


నండూరి రామమోహనరావు


రాజ్ కుమార్


రామకృష్ణ శాస్త్రి


డాంగ్ ఫాంగ్ హాంగ్ 1


కేశవానంద భారతి


సచిన్ టెండుల్కర్



రామ్‌ధారీ సింగ్ దినకర్


పంచాయతీ వ్యవస్థ


స్నప్పీ




పంచాయతీ రాజ్ దినోత్సవం


పుట్టపర్తి సత్య సాయి బాబా

రిపబ్లిక్ స్పోర్ట్స్

# చంపేస్తామంటూ.. గౌతమ్ గంభీర్కు బెదిరింపులు

భారత మాజీ క్రికెటర్, ప్రధాన కోచ్ గంభీర్కు బెదిరింపులు ఈమెయిల్స్ ద్వారా వచ్చాయి. ఈ విషయాన్ని గంభీర్ ఢిల్లీ పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు.



భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్, భాజపా మాజీ ఎంపీ గౌతమ్ గంభీర్కు బెదిరింపులు వచ్చాయి. 'ఐ కిల్ యూ' అంటూ రెండు ఈ-మెయిల్స్ వచ్చినట్లు సెంట్రల్ ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు గంభీర్ ఫిర్యాదు చేశాడు. సైబర్ సెల్ ఎక్కడినుంచి వచ్చాయి? ఎవరు పంపారనే దానిపై విచారణ చేపట్టింది. పహల్గాం ఉగ్ర దాడిపై స్పందించినందుకే గంభీర్ కు ఈ బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. తనకు రక్షణ కల్పించాలని ఢిల్లీ పోలీసులను గంభీర్ కోరాడు. ఐసిస్ కశ్మీర్ నుంచి ఈ బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. "ఉగ్రదాడిలో మృతి చెందినవారి కోసం ప్రార్థిద్దాం. దీనికి బాధ్యులు తప్పకుండా భారీ మూల్యం చెల్లించుకుంటారు. భారత్ తిప్పికొడుతుంది" అని గంభీర్ పహల్గాం ఘటనపై పోస్టు పెట్టిన సంగతి తెలిసిందే. పహల్గాంలో పర్యటకులపై ఉగ్రవాదులు దాడి చేయడంతో 26 మంది మృతి చెందారు. ఇందులో ఇద్దరు తెలుగు వ్యక్తులు ఉన్నారు. ఘటనలో పలువురు గాయపడ్డారు. పాక్ ప్రధానిపై దానిష్ కనేరియా విమర్శలు జమ్మూకశ్మీర్ లో చోటుచేసుకున్న ఉగ్రదాడి ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ స్పందించకపోవడంపై ఆ దేశ మాజీ క్రికెటర్ దానిష్ కనేరియా విమర్శలు గుప్పించాడు. ప్రధాని షరీఫ్కు వాస్తవం తెలుసంటూ వ్యాఖ్యానించాడు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నట్లు పేర్కొన్నాడు. "పాకిస్థాన్కు ఎలాంటి పాత్ర లేకపోతే నేరుగా ప్రధాని షరీఫ్ ఎందుకు ఖండించలేదు. ఎందుకు ఒక్కసారిగా హై అలెర్ట్ ప్రకటించారు? ఎందుకంటే వాస్తవం ఏంటో మీకు తెలుసు. మీరే టెర్రరిస్టులకు ఆశ్రయం కల్పించి పెంచి పోషిస్తున్నారు. మిమ్మల్ని చూస్తుంటే సిగ్గేస్తోంది" అని పోస్టు పెట్టాడు.

## ఇంటి చిట్కాలు

# మొక్కలు వాడిపోకుండా ఎండల నుంచి కాపాడే సహజ ఎరువులు, ఇంట్లోనే సులభంగా చేసుకోవచ్చు ఎలాగంటే

ఎండల దెబ్బకి మొక్కలు ఎండిపోతాయి. ఇప్పటికే చాలా మొక్కలు ఎండిపోవడం ప్రారంభించాయి. అందుకే మొక్కల్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎండలకు తట్టుకుని నిలబడటానికి మొక్కలకు చల్లదనం అవసరం.

వేసవి కాలం రాబోతుంది. ఇప్పటికే ఎండలు దంచికొడుతున్నాయి. ఎండలకి మనుషులే కాదు మొక్కలు కూడా అల్లాడిపోతాయి. ఎండల దెబ్బకి మొక్కలు ఎండిపోతాయి. ఇప్పటికే చాలా మొక్కలు ఎండిపోవడం ప్రారంభించాయి. అందుకే మొక్కల్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎండలకు తట్టుకుని నిలబడటానికి మొక్కలకు చల్లదనం అవసరం. మొక్కలకి చల్లదనాన్ని ఇవ్వడానికి కొన్ని ఎరువులు సాయపడతాయి. ఈ ఎరువుల వల్ల మొక్కలు పోషకాలతో పాటు చల్లదనాన్ని కూడా పొందుతాయి. వేసవిలో, ఎక్కువగా ద్రవ ఎరువులను వాడాలి. వీటిలో నత్రజని, కాల్షియం, సల్ఫర్, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి మొక్కలకు మంచి పోషణను అందిస్తాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల మొక్కలు ఎండిపోవు. అలాంటి నాలుగు ఎరువులు ఎలా తయారు చేయాలో ఇక్కడ తెలుసుకుందాం.



### ఆవు పేడ ఎరువు



సులభంగా లభించే ఎరువులలో ముందుగా గుర్తుకు వచ్చే పేరు ఆవు పేడ. ఇది ఇంటి తోటపనికి బాగా పనికివస్తుంది. అంతేకాకుండా సులభంగా లభిస్తుంది. దీనిని తయారు చేయడానికి, ఆవు పేడ పిడకల్ని ఒక బకెట్ నీటిలో వేసి, మూతపెట్టి 3 రోజులు అలాగే ఉంచండి. 3 రోజుల తర్వాత, దానిని మరొక పాత్రలోకి వడకట్టండి. ఈ మిశ్రమాన్ని ప్రతి 2 నుంచి 3 రోజులకు ఒకసారి మొక్క మట్టిలో కలపండి. మీరు కావాలనుకుంటే దీనిని ద్రవ ఎరువుగా ఉపయోగించవచ్చు.

### మజ్జిగతో ఎరువు



పెరుగును బాగా చిలికి వెన్న తీసిన తర్వాత మిగిలిన మజ్జిగను కూడా మొక్కలకు ఎరువుగా ఉపయోగించవచ్చు. ఇందుకోసం ఇంట్లో తయారుచేసిన మజ్జిగను ప్లాస్టిక్ బకెట్‌లో నింపండి. ఆ తర్వాత దాని ఓ మూత పెట్టి పది రోజులు అలానే ఉంచండి. ఈ సమయంలో మజ్జిగ బాగా పులిసిపోతాయి. ఆ తర్వాత ఒక లీటర్ నీటిలో 200 మి.లీ మజ్జిగను కలపండి. బాగా కలిపిన తర్వాత ఈ మిశ్రమాన్ని 500 మి.లీ చొప్పున మొక్కకు పోయాలి. ఈ మిశ్రమం వల్ల మొక్కకు చల్లదనంతో పాటు పోషకాలు కూడా బాగా అందుతాయి.

### వేప పిండి



వేప పిండిని కూడా చల్లని ఎరువుగా మొక్కలకు ఉపయోగించవచ్చు. నిజానికి వేప పిండి మొక్కలో నత్రజని లభ్యతను పెంచుతుంది. దీనిని ఉపయోగించడానికి ముందుగా 50% తోట మట్టి, 30% ఆవు పేడ ఎరువు, 20% వేప పిండి మిశ్రమాన్ని బాగా కలపండి. ఇప్పుడు దానిపై తేలికగా నీళ్లు చల్లండి. ఆ తర్వాత దీనిని మొక్కలకు ఎరువుగా ఉపయోగించవచ్చు. మొక్కలో మట్టిలో ఈ మిశ్రమాన్ని కలిపితే సరిపోతుంది.

### ఎండిన ఆకుల కంపోస్ట్



చెట్లు, మొక్కల నుంచి ఎండిన ఆకులు రాలి కింద పడతాయి. ఇలాంటి ఆకుల్ని చెత్తగా పారేసే బదులు మొక్కలకు ఎరువుగా ఉపయోగించవచ్చు. వీటిని సేంద్రీయ ఎరువులు అంటారు. ఇది నేలను సారవంతం చేయడానికి పనిచేస్తుంది. ఇది గరిష్టంగా నీటిని గ్రహించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. వేసవిలో మొక్కల వేర్లను చల్లగా ఉంచడానికి దీనిని ఉపయోగించవచ్చు. ఇందుకోసం ఎండిన ఆకుల్ని తీసుకుని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుని ఒక బక్కెట్‌లోకి తీసుకోండి. వీటిపై కొంచెం నీళ్లు చల్లండి. ఆ తర్వాత మూతపెట్టి కొన్ని రోజులు అలాగే ఉంచండి. మధ్యమధ్యలో మూత తీసి బాగా కలిపి నీళ్లు చల్లుతూ ఉండండి. కొన్ని రోజుల తర్వాత ఎరువు సిద్ధంగా ఉంటుంది. ఒక మొక్కకు గుప్పెడు ఎరువు తీసుకుని మొదళ్లలో చల్లండి. ఆపై తేలికగా నీరు పెట్టండి. ఇలా చేయడం వల్ల మొక్కలకు తగిన పోషణ అంది అవి ఎండిపోవు.

### ఉల్లిపొట్టు



ఉల్లి పొట్టు కూడా మొక్కలకు సహజ ఎరువుగా పనిచేస్తుంది. మొక్కలు ఎండిపోకుండా నివారించడంలో ఉల్లిపొట్టు కీలక పాత్ర పోషిస్తుంది. ఉల్లి పొట్టును అలా మొక్కల పొదల్లో వేసినా సరిపోతుంది. లేదంటే.. ఐదు లీటర్ల గోరు వెచ్చని వాటర్‌లో ఓ ఇరవై నుంచి ముప్పై గ్రాముల ఉల్లిపొట్టుని వేసి నాలుగు రోజుల పాటు అలానే ఉంచాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మొక్కలపై పిచికారీ వేస్తే.. అవి ఎండిపోకుండా బాగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.



**గమనిక**
ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. ఈ విషయాల్ని సమయం తెలుగు ధృవీకరించడం లేదు.